సాక్షి
వరంగల్

గురువారం । 31 । ఆగస్టు । 2023



బాధితులకు సోదరులై..
ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలతో సర్వం కోల్పోయిన వరద బాధితులకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు చేయూతనందించారు. - 8లో▸



చంద్రయాన్-3పై అవగాహన
చంద్రయాన్-3పై ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
$33^0/24^0$
జిల్లాలో ఈరోజు ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్జేడీని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు



కాశోజీ సెంటర్: పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణను టీఎన్జీఓస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పదోన్నతి కల్పించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గజ్జెల రాంకిషన్, వేణుగోపాల్, ఉపాధ్యక్షులు రామానుజ జగదీశ్వర్, గద్దల రాజు, రాష్ట్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, విద్యాశాఖ ఫోరం అధ్యక్షుడు ఎస్‌బీ.శ్రీనివాస్, కార్యదర్శి పట్టపురి సోమయ్య, నాయకులు నాగేశ్వరరావు, భాస్కర్, యాదగిరి, భరత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

కాశోజీ సెంటర్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ వరంగల్ జిల్లా బాధ్యులు వెంకట్‌రెడ్డి, గోవిందరావు, కుమార్, మనోజ్, యాకయ్య పిలుపునిచ్చారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని, పదోన్నతులు కల్పించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని తదితర డిమాండ్లతో చేపట్టే ధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులు తరలిరావాలని సూచించారు.

ఇళ్లు కోల్పోయిన వారికి 'గృహలక్ష్మి'



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోయిన వారికి 'గృహలక్ష్మి' పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామని కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా భరోసా ఇచ్చారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో బుధవారం వారు గ్రామంలో పర్యటించారు. సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే వారికి కూడా లబ్ధి చేకూరుస్తామన్నారు. తహసీల్దార్ ఎండీ.రియాజుద్దీన్, కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేష్, సొసైటీ వైస్ చైర్మన్ కందుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ల్యాదెల్ల బాలు, బీఆర్‌ఎస్ నాయకులు లవ్‌రాజు, జన్ను నర్సయ్య, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వలలో కొండచిలువ



వర్ధన్నపేట: ఆకేరు వాగులో చేపలు పట్టడానికి వెళ్లిన మత్స్యకారులకు బుధవారం తెల్లవారు జామున భారీ కొండచిలువ చిక్కింది. మత్స్యకారులు వలను ఒడ్డుకు లాగేందుకు ప్రయత్నం చేశారు. వల నుంచి బయటకు వచ్చే ప్రయత్నం చేస్తూ కొండచిలువ చివరకు మృతి చెందింది. గతంలోని రెండు పర్యాయాలు మత్స్యకారుల వలలకు కొండచిలువలు చిక్కాయి. ఇంత భారీ కొండచిలువ ఇదే మొదటిసారి కావడంతో చేపల వేటకు వెళ్లాలంటే మత్స్యకారులు భయాందోళనకు గురవుతున్నారు.

ఐదుగురు డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బుధవారం నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ సెకండియర్ పరీక్షల్లో మూడు పరీక్ష కేంద్రాల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.నరేందర్ తెలిపారు. జనగామలోని ఏబీవీ కళాశాలలో ముగ్గురు, వరంగల్ ఏఎస్‌ఎం కళాశాలలో ఒకరు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు వారు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కాదు.. ఫోర్టిఫైడ్ రైస్!

రేషన్ బియ్యం నుంచి వేరు చేసి పారబోస్తున్న లబ్ధిదారులు

- ప్రజలకు అవగాహన కల్పించని పౌరసరఫరాల శాఖ అధికారులు
- ఆహారంగా వండుకొని తినాలని సూచిస్తున్న నిపుణులు
- జిల్లాలో 2,66,740 రేషన్‌కార్డులు..
- నెలనెలా 49,80,857 కిలోల బియ్యం పంపిణీ



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు మాటూరి రమాదేవి. దుగ్గొండి మండలం గిర్నిబావి గ్రామం. స్వతహాగా పిండి గిర్ని నడుపుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో రాజ్యతండా, పీజీతండా గ్రామాలకు చెందిన గిరిజనులు రేషన్ బియ్యాన్ని పిండి మర ఆడించడానికి తీసుకొస్తున్నారు. అయితే పిండి పడుతున్న క్రమంలో బలవర్ధక బియ్యం అలాగే పిండిలో వస్తుండటాన్ని గమనించింది. వెంటనే అందులోని ఫోర్టిఫైడ్ బియ్యాన్ని వేరు చేసి పారబోసింది. అవి మెత్తగా రబ్బరులా ఉండడంతో ప్లాస్టిక్ బియ్యం అని భావించింది. ఇది ఒక్క మాటూరి రమాదేవి పరిస్థితి కాదు. రేషన్ బియ్యాన్ని తినే ప్రతి ఇంటిలో ఇదేవిధంగా ఉంది. బలవర్ధక (ఫోర్టిఫైడ్) బియ్యాన్ని వేరు చేసి పడేస్తున్నారు.

దుగ్గొండి: జిల్లాలోని 13 మండలాల పరిధిలో 2,66,740 రేషన్ కార్డులు ఉన్నాయి. 37,661 అంత్యోదయకార్డులు, 2,53,130 ఎఫ్‌ఎస్‌సీ, 70 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ప్రతి నెల నిరుపేదల ఆకలి తీర్చడానికి ప్రభుత్వం 49,80,857 కిలోల బియ్యాన్ని సరఫరా చేస్తోంది. అయితే నిరుపేదలు తినే ఆహారం బలవర్ధకంగా ఉండాలని 2022 వానాకాలానికి ముందు బలవర్ధక (ఫోర్టిఫైడ్ రైస్) బియ్యాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు మైక్రోన్యూట్రియంట్స్, ఐరన్, ఫెర్రిక్ పైరోపాస్ఫేట్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ-12, హైడ్రాక్సికోబాల్మిన్ లాంటి పోషకాలతో ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యాన్ని తయారు చేసి మిల్లర్లకు అందిస్తోంది. వీటిని బియ్యం పడుతున్న సమయంలో మిల్లర్లు ప్రత్యేకంగా తయారు చేసిన మిషన్‌లో పోస్తారు. దీంతో అవి బియ్యంతో కలిసి వస్తాయి. ప్రతి క్వింటాలు బియ్యానికి 100 గ్రాముల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలిపి బస్తాల్లో నింపుతారు. ఇలా నింపిన బియ్యాన్ని రేషన్ షాపులద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు.

ప్లాస్టిక్ బియ్యమనే భ్రమ..
ఫోర్టిఫైడ్ రైస్ వివిధ పోషకాల సమ్మిళితంగా ఉండటం వల్ల కొంత మేర రబ్బరు గుణాన్ని కలిగి ఉంటాయి. దీంతో లబ్ధిదారులు వాటిని ప్లాస్టిక్ బియ్యమని భ్రమపడుతున్నారు. తినడానికి ఇష్టపడటం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఫోర్టిఫైడ్ బియ్యంపై గ్రామాల్లోని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని పలువురు ఈ సందర్భంగా కోరుతున్నారు..



ప్రభుత్వం మిల్లర్లకు సరఫరా చేసే ఫోర్టిఫైడ్ ముడి బియ్యం బస్తా

రేషన్‌డీలర్ల ద్వారా అవగాహన కల్పిస్తాం..
గ్రామాల్లో పేదలంతా రేషన్ బియ్యం ఆహారంగా తీసుకుని జీవనం సాగిస్తున్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం ఆరోగ్యానికి చాలా మంచివి. అన్ని రకాల పోషకాలు ఉండేలా వాటిని నిపుణులు తయారు చేశారు. ఎన్ని బియ్యానికి ఎన్ని ఫోర్టిఫైడ్ బియ్యం కలపాలని సాంకేతికత ఆధారంగా సూచనలిచ్చారు. వినియోగదారులకు ఫోర్టిఫైడ్ బియ్యంపై రేషన్ డీలర్ల ద్వారా అవగాహన కల్పిస్తాం..
– చందన్‌కుమార్, డీఎస్‌ఓ

ఫోర్టిఫైడ్ రైస్ ఆరోగ్యానికి మంచివి..



పేదలు ఆరోగ్యంగా ఉండాలని అన్ని రకాల ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. మామూలు బియ్యంతోపాటు ఫోర్టిఫైడ్ రైస్ కలిపి వచ్చే విధంగా రూ.10 లక్షలతో ఒక్కో మిల్లర్‌చేత మిషన్ కొనుగోలు చేయించాం. బియ్యంలో ఉండేవి ఫోర్టిఫైడ్ రైస్. అవి ప్లాస్టిక్ బియ్యం కాదు. వాటిని ఏరివేయకుండా కలిపి వండుకుని తింటే అనేక పోషకాలు శరీరానికి అందుతాయి. ప్రైవేట్ షాపుల్లో ఎక్కడా ఫోర్టిఫైడ్ బియ్యం లభించవు. అపోహలు వీడి బలవర్ధక బియ్యాన్ని తిని ఆరోగ్యంగా జీవించాలి..
– ఇరుకు కోటేశ్వర్‌రావు, రైస్ మిల్లర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు

రక్షాబంధన్‌కు వేళాయె..



వరంగల్ పిన్నావారి వీధిలోని దుకాణంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను గురువారం ప్రజలు ఘనంగా జరుపుకోనున్నారు. ఈ మేరకు వరంగల్‌లోని పిన్నావారి వీధి, చౌరస్తా, వర్ధన్నపేట, నర్సంపేటతోపాటు పలు గ్రామాల్లో మహిళలు బుధవారం రాఖీలు కొనుగోలు చేశారు. మిఠాయిల దుకాణాలు కిక్కిరిసిపోయాయి. కాగా, విద్యాసంస్థల్లో ఒకరోజు ముందే రాఖీ పండుగ నిర్వహించడంతో సందడి నెలకొంది.
– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్

నేడు అమ్మవారికి పవిత్రోత్సవం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం అమ్మవారికి వైభవంగా పవిత్రోత్సవం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా బుధవారం దేవాలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకుడు చెప్పెల వెంకటనాగరాజు శర్మ, వేదపండితులు, వేద విద్యార్థులు సంప్రోక్షణ నిర్వహించారు. అమ్మవారికి ఊర్ణ సూత్రల దండలను అలంకరించి పవిత్రోత్సవం నిర్వహించనున్నారు. దేవాదాయశాఖ ఏసీ, ఆలయ ఈఓ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఏర్పాట్లు చేస్తున్న అర్చకులు, సిబ్బంది

విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించాలి

కాశోజీ సెంటర్: విద్యార్థుల్లోని సామర్థ్యాలను వెలికితీసేందుకు బోధన విధానాలను మెరుగుపర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి గణితం, జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయులకు వరంగల్‌లో నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ తరగతులు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా తరగతులను పరిశీలించి ఆమె మాట్లాడుతూ గణితంపై విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. లో కాస్ట్, నో కాస్ట్ బోధన ఉపకరణాలను ఉపయోగించి విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ జి.కృష్ణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు శ్రీనిధి, శారదాబాయి, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు ఎండీ.అజిత్, లోకేష్, ఆనంద్‌బాబు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

కూలీల పైనుంచి దూసుకెళ్లిన బైక్

- ముగ్గురికి తీవ్ర గాయాలు

వర్ధన్నపేట: వరినాటు వేసిన కూలీలు రోడ్డు పక్కనే కూర్చుని సేద తీరుతున్న సమయంలో ఓ గుర్తు తెలియని బైక్ అతి వేగంగా దూసుకెళ్లడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురికి స్వల్ప గాయాలైన సంఘటన బుధవారం రాత్రి ఇల్లందలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..ఇల్లంద గ్రామ సమీపంలోని ఎస్సీ కాలనీ వద్ద వరినాటు వేసిన కూలీలు రోడ్డు పక్కన కూర్చొని శీతల పానీయం తాగుతూ సేద తీరుతున్నారు. ఈ క్రమంలో ఓ గుర్తు తెలియని బైక్ వరంగల్ వైపు నుంచి తొర్రూరు వైపు అతి వేగంతో రోడ్డు పక్కన కూర్చున్న మహిళా కూలీలపై నుంచి ఆగకుండా వెళ్లి పోయింది. దీంతో చాబంతుల వీరమ్మ కాలుకు, బెల్లి సూరమ్మ తలకు, కన్నెబోయిన బతుకమ్మ చేతికి తీవ్ర గాయాలు కాగా వారిని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ హుటాహుటినా వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. స్వల్పంగా గాయపడిన మరో ఐదుగురిని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేసి ఇళ్లకు పంపించారు.



తీవ్రంగా గాయపడిన కూలీలను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

రైతులకు పరిహారం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే..

దుగ్గొండి: దేశంలోనే తొలిసారి పంటలు నష్టపోతే రైతులకు పరిహారం అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. రేకంపల్లి రైతు వేదిక పరిధిలోని 2,907 మంది రైతులకు రూ.3.97 కోట్ల విలువైన పంట నష్టం చెక్కులను బుధవారం గిర్నిబావిలో అందజేశారు. అంతకుముందు గిర్నిబావిలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై వేలాది మంది రైతులకు భారీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. వర్షాలకు నష్టపోయిన పంటలను సీఎం కేసీఆర్ పరిశీలించినట్లు గుర్తు చేశారు. తాను అధికార, ప్రతిపక్ష పాత్రలు పోషించి పరిహారం ఇప్పించానని వివరించారు.

రూ.75 కోట్ల సబ్సిడీ మంజూరు..
అడవిరంగాపురం గ్రామంలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రంధ్రాలు పడిన పీవీసీ పైపు కనిపించడంతో చలించిపోయారన్నారు. వెంటనే పైపులైన్లు, మోటారు, వ్యవసాయ పరికరాల కోసం రూ.75 కోట్ల సబ్సిడీ మంజూరు చేశారన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, ఏడీఏ తోట శ్రీనివాసరావు, ఏఓ దయాకర్, రైతు బంధు సమితి అధ్యక్షుడు తోకల నర్సింహారెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, సుకినె రాజేశ్వర్‌రావు, కాట్ల భద్రయ్య, శ్రీనివాసరెడ్డి, శానబోయిన రాజుకుమార్, శంకేషి కమలాకర్, రాంబాబు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు



దుగ్గొండి : రైతులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నర్సంపేట మండలం మాదన్నపేటకు చెందిన 15 కుటుంబాలు, బాంజీపేట గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, ఖానాపురం మండలం దేవునితండా (అయోధ్యనగర్)కు చెందిన 15 కుటుంబాలు, నల్లబెల్లి మండలం కొండైయిలుపల్లి, కన్నారావుపేటకు చెందిన 20 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరాయి. వారికి ఎమ్మెల్యే పెద్ది కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గొట్టిముక్కల రాము, కాసర్ల మధుసూదన్‌రెడ్డి, పెంతల ముకుందరెడ్డి, పెంతల లింగారెడ్డి, కీసరి శ్రీనివాస్, పెంతల విజేందర్‌రెడ్డి, మామిడ్ల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ

రూ.23 కోట్లు మంజూరు చేసిన పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖ

- సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు
- త్వరలో పనులు ప్రారంభించనున్న అధికారులు

నర్సంపేట: నియోజకవర్గంలోని మండలాలకు అనుసంధానంగా సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి జీఓ 396 ద్వారా రూ.23 కోట్ల నిధులు మంజూరయ్యాయి. భారీగా కురిసిన వర్షాలతో నర్సంపేట నుంచి మండలాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు గుంతలమయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రజల నుంచి వచ్చిన నివేదిక మేరకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించారు. నెక్కొండ, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నర్సంపేట మండలాల్లోని పలు గ్రామాల మధ్య లింకు రోడ్లు, అంతర్గత రోడ్ల కోసం నిధులు మంజూరు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నల్లబెల్లి మండలంలోని దస్తగిరిపల్లి నుంచి నల్లబెల్లి వరకు 2.5 కిలోమీటర్ల రోడ్డును రూ.1.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. నేషనల్ హైవే నుంచి అర్శనపల్లికి కిలోమీటరున్నర రోడ్డుకు రూ.1.60 కోట్లు, రంగాపురం-ముచ్చింపుల రోడ్డుకు రూ.35 లక్షలు, లక్ష్మీతండా బీటీ రోడ్డు నుంచి రంగాయ చెరువు వరకు 2.4 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.10 కోట్లు, కొండైలుపల్లి నుంచి నారక్కపేట వరకు కిలోమీటరు రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరు చేశారు.
- ఖానాపురం మండలం పాకాల అశోక్‌నగర్ నుంచి పెద్దమ్మగడ్డ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షలు, ఖానాపురం నుంచి రంగాపూర్ రోడ్డ మరమ్మతుల కోసం రూ.1.65 కోట్లు మంజూరయ్యాయి.
- చెన్నారావుపేట మండలంలో అమీనాబాద్ నుంచి శంకరమ్మతండా వరకు 1.1 కిలోమీటరు రోడ్డుకు రూ.70 లక్షలు కేటాయించారు.
- నెక్కొండ మండలంలో వెంకటాపురం నుంచి సాయిరెడ్డిపల్లి వరకు 3.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.40 కోట్లు, రెడ్లవాడ నుంచి బొల్లికొండ వరకు 5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి.
- దుగ్గొండి మండలంలో లక్ష్మీపురం నుంచి దేశాయిపల్లి వరకు 2 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2 కోట్లు, రేకంపల్లి నుంచి నాచినపల్లి వరకు 5.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.8 కోట్లు, బొబ్బరోనిపల్లి నుంచి రాజేశ్వర్‌రావుపల్లి వరకు కిలోమీటరు రోడ్డుకు రూ.70 లక్షలు, అడవిరంగాపురం నుంచి నందనాయక్‌తండా వరకు 2.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.40 కోట్లను మంజూరు చేశారు.
- నర్సంపేట మండలంలోని కమ్మపల్లి నుంచి మహ్మదాపురం వరకు 2.3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.60 కోట్లు, దాసరిపల్లి నుంచి బాంజీపేట వరకు కిలోమీటరు రోడ్డుకు రూ.70 లక్షలు, శివాని పబ్లిక్ స్కూల్ సమీపం నుంచి రామవరం వరకు 1.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.90 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.



మరమ్మతుకు నోచుకోనున్న రహదారి (ఫైల్)

మండలాల్లోని గ్రామాలకు లింకు, సీసీ రోడ్లు : ఎమ్మెల్యే
నర్సంపేట నియోజకవర్గంలోని పలు చోట్ల రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి జీఓ 396 ద్వారా బుధవారం రూ.23 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సీసీ, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి ప్రజల డిమాండ్ మేరకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా చెన్నారావుపేట, నెక్కొండ, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నర్సంపేట మండలాల్లోని పలు గ్రామాల మధ్య లింకు, ఇంటర్నల్ రోడ్ల కోసం రూ.23 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన సంబంధిత మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ పనులను అతి త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పెద్ది పేర్కొన్నారు.

రంగాయ కాల్వ బ్రిడ్జిని పరిశీలించిన అధికారులు



రంగాయ కాల్వ బ్రిడ్జిని పరిశీలిస్తున్న డీఈ, ఏఈ

సాక్షి ఎఫెక్ట్

నల్లబెల్లి: దేవాదుల ఫేజ్-3లో రంగాయ చెరువు ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించారు. ఇందులో భాగంగా శంషాబాద్ గ్రామ పరిధిలోని రంగాయ చెరువు కుడి కాల్వపై నిర్మించిన బ్రిడ్జి మంగళవారం కూలిపోయింది. కుప్పకూలిన 'రంగాయ' కాల్వ బ్రిడ్జి శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఐబీ అధికారులు సందర్శించారు. డీఈ యశ్వంత్, ఏఈ రత్నాకర్ పరిశీలించారు. దీనిపై పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

బీఆర్‌ఎస్‌దే మూడోసారి అధికారం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం: సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నదని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పల్లారుగూడ, మొండ్రాయి, నార్లవాయి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. గత మార్చిలో మొండ్రాయి క్లస్టర్‌లో అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన 2,363 మంది రైతులకు రూ.2,06,36,000 విలువైన చెక్కులను అందజేశారు. పల్లారుగూడలో రూ.85 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గొల్లపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించతలపెట్టిన నూతన పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాలకు పంటలు దెబ్బతింటే గత ప్రభుత్వాలు పరిహారం చెల్లించలేదన్నారు. రైతులు మరణిస్తే రైతుబీమా ద్వారా రూ.5 లక్షలు అందిస్తున్నట్లు వెల్లడించారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు కావడం లేదన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడోసారి పగ్గాలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, పీఆర్ డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ రమేష్‌కుమార్, ఏఓ యాకయ్య, సర్పంచ్‌లు కక్కెర్ల కుమారస్వామి, మేరుగు మల్లేశం, గూడ కుమారస్వామి, ఇజ్జగిరి స్వప్న, కోడూరి రజిత, ఎంపీటీసీలు గుగులోత్ వీరమ్మ, కొనకటి రాణి, కట్ల సుమలత, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మొండ్రాయిలో రైతులకు పంటనష్ట పరిహారం చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా వాసికి కీలక బాధ్యత



హన్మకొండ: బీజేపీ తెలంగాణ రాష్ట్ర డాటా అండ్ కాల్ సెంటర్ టీమ్ కన్వీనర్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లావాసి రావుల భరత్ రెడ్డికి అధిష్టానం కీలక బాధ్యత అప్పగించింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామానికి చెందిన రావుల భరత్‌రెడ్డి విద్యార్థి దశలోనే ఏబీవీపీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. యూకేలో ఉన్నత విద్య పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేసిన ఆయన.. రాజకీయాలపై మక్కువతో స్వదేశం చేరుకుని బీజేపీలో కీలక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



కరెంట్‌షాక్‌కు గురై మృతి చెందిన రైతు శంకర్

తొర్రూరు రూరల్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని టీక్యాతండా జీపీ శివారు జగ్న తండాలో జరిగింది. తండాకు చెందిన జాటోత్ శంకర్(50) బుధవారం తన పశువులకు పొలంలో గడ్డి కొస్తున్నాడు. ఈ క్రమంలో వేలాడుతున్న కరెంట్ సర్వీస్ వైర్‌ను గమనించకుండా తాకాడు. దీంతో విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య సోమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

బాధితులకు సోదరులై..

వరదతో సర్వస్వం కోల్పోయిన వారికి ఆత్మీయ బంధువులుగా నిలిచారు..

వారు అక్కాతమ్ముళ్లు కాదు.. చెల్లి అన్నయ్యలు కాదు.. అసలే రక్త సంబంధం కాదు.. ఒకరంటే ఒకరికి పరిచయం లేదు. కానీ వారిని ఓ బంధం కలిపింది. అదే వరద బంధం. తోబుట్టువులు కూడా ఆదరించలేని ఈ రోజుల్లో ఎలాంటి సంబంధం లేని వారు 'అధైర్య పడకండి.. మేమున్నామంటూ' క'న్నీటి' వరద నుంచి కాపాడారు. ఇటీవల కురిసిన వర్షం వరంగల్ నగరంతోపాటు భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని పలు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. నిత్యావసరాల నుంచి గృహోపకరణాల వరకు సర్వం వరదలో కొట్టుకుపోయాయి. కట్టుబట్టలు మాత్రమే మిగిలి హాహాకారాలు చేస్తున్న సమయంలో తామున్నమంటూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకువచ్చారు. తమకు తోచిన సాయం అందించి వరద బాధితులను క'న్నీటి' కష్టం నుంచి గట్టెక్కించారు. దీంతో నిరాశ్రయులు వారికి శతకోటి వందనాలు పెట్టారు. ఆపదలో కాపాడిన వారే తమకు నిజమైన రక్తసంబంధీకులు అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేడు రాఖీ పౌర్ణమి సందర్భంగా వరద బాధితలకు చేయూతనందించి ప్రేమబంధం చాటిన వారిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ ఏటూరునాగారం

సోదరుల్లా అక్కున చేర్చుకున్నారు..

- సామాజిక సేవలో శివనగర్ మిత్ర మండలి ఆదర్శం..
- వరద బాధితులకు పలు రకాలుగా చేయూత



వరద బాధితులకు కూరగాయలు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు (ఫైల్)

వరద ముంపు బాధితులకు శివనగర్‌లో ఏర్పాటు చేసిన శివనగర్ మిత్రమండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ అండగా నిలిచింది. మానవతా దృక్పథంతో మేమున్నామంటూ నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందజేసింది. వరదల్లో చిక్కుకుని కనీసం తాగేందుకు నీరు, తినడానికి ఆహారం కూడా లభించని సమయాన బాధితుల కన్నీళ్లు తుడిచేందుకు శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ మేరుగు అశోక్ తోబుట్టువులా ముందుకు వచ్చారు. బాధితులను అక్కున చేర్చుకుని ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసి వారి ఆకలితీర్చారు. దీంతో పలువురు సమాజసేవకులు మేరుగు అశోక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు.

తోబుట్టువులా ఆదుకున్నారు..



ఇటీవల కురిసిన వర్షాలకు మా కాలనీ మొత్తం జలమయమైంది. కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఆ సమయంలో తాగునీరుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. దీంతో మీకు మేమున్నామంటూ శివనగర్ మిత్ర మండలి, వీరలక్ష్మి ఫౌండేషన్ బాధ్యులు ముందుకువచ్చారు. తోబుట్టువులా నిలిచి మమ్ములను ఆదుకున్నారు. వారే నాకు నిజమైన సోదరులు. వారికే రాఖీ కట్టి సోదరభావం చాటుకుంటా.

అల్లం స్వరూప, శివనగర్

రక్త సంబంధీకులు కాకపోయినా..



గత నెలలో కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో ప్రతి ఇంట్లో వస్తువులు కోట్టుకుపోయి ఇబ్బందులు పడ్డాం. మా బాధలను తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్ని రకాల సహకారం అందించారు. రక్త సంబంధీకులు కాకపోయినా ఎక్కడి నుంచో వచ్చి మాకు సరుకులు అందించారు. వారి సహకారంతో కొంత ఉపశమనం పొందాం.

-కొత్త సుదర్శన్‌రెడ్డి, రైతు మోరంచపల్లి

వారి సహకారం మరువలేనిది



గ్రామంలో వరద కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనగా కుటుంబీకులు, తోడ పుట్టిన వారు ఓదార్పే తప్ప ఎవరూ ఆదుకోవడానికి ముందుకు రాలేదు. కానీ వేర్వురు గ్రామాల నుంచి మాకు పరిచయం లేని వ్యక్తులు వచ్చి వంట సామాను, చద్దర్లు, డబ్బు, అన్నదానం, మంచి నీళ్ల పంపిణీ చేశారు. వారి సహకారం జీవితంలో మర్చిపోలేం.

-చుక్క కవిత, గృహిణి, మోరంచపల్లి

హసన్‌పర్తి: రాఖీ ఆకారంలో పెంబర్తిలోని ఏకశిల టెక్నో పాఠశాల విద్యార్థులు



మోరంచపల్లిలో వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు (ఫైల్)



స్వచ్ఛంద సంస్థలు, దాతల ఔదార్యం

- వరద బాధితులకు ఆపన్నహస్తం

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల, దొడ్ల గ్రామాల్లో గత నెలలో సంభవించిన వరదలతో గ్రామస్తులు సర్వస్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలి పుట్టెడు దుఃఖంలో వీరికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు అండగా నిలిచాయి. సోదరుల వలే మనోధైర్యం నింపుతూ నిత్యావసరాలు, దుస్తులు అందజేసి ఆసరా అయ్యారు. దీంతో ఆడబిడ్డకు పుట్టినింటి నుంచి పంపినట్లు నిత్యావసరాలు అందజేసి తమను ఆదుకున్నారని, వీరి సేవలను జన్మలో మరిచిపోలేమని వరద బాధితులు పేర్కొన్నారు.

వరదలతో అతలాకుతలం



వరదలతో కొండాయి గ్రామం పూర్తిగా అతలాకుతలమైంది. నిరాశ్రయులుగా మిగిలిన మమ్ములను స్వచ్ఛంద సంస్థలు, మహిళా ప్రతినిధులు అక్కా, చెల్లెల్లవలే వచ్చి ఆదుకున్నారు. కట్టుబట్టలతో రోడ్డున పడిన మాకు దుస్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసి ఆదుకున్నారు. వారి సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేం.

-కట్ల సందీప్, కొండాయి

సొంతోళ్లు కూడా ఇలా చేయరు..



ఇల్లు నీటిలో మునిగి దిక్కు తోచని స్థితిలో ఉన్న సమయంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు మా దగ్గర వచ్చి కావాల్సిన వస్తువులు అందజేసి ఆదుకున్నారు. సొంతోళ్లు కుడా ఇలా చేయరు. దీనిపై వారికి జన్మజన్మలకు రుణపడి ఉంటాం.

-బొల్లికుంట లక్ష్మి,మల్యాల

కంబాలపల్లిలో వృక్ష రక్షాబంధన్

- పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వృక్ష రక్షాబంధన్ వేడుకలు జరుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం మొక్కలు, చెట్లకు రక్షాబంధన్ చేశారు. తమ పరిసరాల్లోని మొక్కలు, చెట్లను కాపాడుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం హెచ్‌ఎం రమేశ్ బాబు మాట్లాడుతూ చెట్లు పర్యావరణం, మానవులకు చేస్తున్న మేలును తెలియజేసే ఉద్దేశంతో వృక్ష రక్షాబంధన్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు, పర్యావరణ పరిశోధకుడు వి.గురునాథరావు మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అవసరంపై అవగాహన ఉండాలన్నారు. 15 సంవత్సరాలుగా ఈ వృక్ష రక్షాబంధన్ దివస్ జరుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రామనర్సయ్య, ఉప్పలయ్య, శ్రీనివాస్, తిరుపతి, సోమేశ్వర్, శోభారాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్‌-3 పై అవగాహన



చంద్రయాన్‌-3 గురించి వివరిస్తున్న వెంకటనారాయణ

గార్ల: చంద్రయాన్‌-3పై గార్ల వాసి, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ గంజి వెంకటనారాయణ బుధవారం గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్‌-3తో చంద్రుడి దక్షిణార్ధ గోళంలో విద్యుత్‌శక్తిని ఉత్పత్తి చేసే హీలియం ఖనిజం నిక్షిప్తమైనట్లు గుర్తించామన్నారు. పది కేజీల హీలియం ఖనిజం పొందగలిగితే రాష్ట్రానికి సంవత్సరం పాటు విద్యుత్‌ను అందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఆయనను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చార్లి, అజిత్, సుందరయ్య, రాజేష్, వెంకన్న, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కర్రతో కొట్టి.. ఉరివేసి..

- భార్యను కడతేర్చిన భర్త..
- కాశిగూడెంలో ఘటన



హజరత్‌బీ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మద్యానికి బానిసైన భర్త.. భార్యను దారుణంగా కడతేర్చాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేశారు. ఈ ఘటన మండలంలోని రంగరాయగూడెం శివారు కాశిగూడెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కాశిగూడేనికి చెందిన షేక్ ఖాసీమ్ కుమార్తె సయ్యద్ హజరత్‌బీ(28)కి తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన అమీర్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. హజరత్‌బీ, అమీర్ దంపతులు కొన్నేళ్లుగా కాశిగూడెంలో బండ కొట్టే పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన అమీర్.. తరచూ భార్యతో గొడవపడేవాడు. తాను మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వమని వేధించేవాడు. ఈ క్రమంలో అమీర్ మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి తాగేందుకు డబ్బులు ఇవ్వమని భార్యతో గొడవపడ్డాడు. కర్రతో కొట్టడంతో పాటు విద్యుత్ ప్లగ్‌లలో వైర్లు పెట్టి కరెంట్ షాక్ పెట్టి హింసించాడు. అనంతరం అర్ధరాత్రి ఆమె నిద్రిస్తున్న సమయంలో ఉరివేసి హత్య చేసి పారిపోయాడు. బుధవారం ఉదయం హజరత్ మృతిచెంది ఉన్న విషయాన్ని గుర్తించిన ఆమె తండ్రి ఖాసీం చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ రాఘవేందర్ ఘటనా స్థలికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, నిందితుడు పరారీలో ఉన్నాడు.

కొడుకుపై తండ్రి హత్యాయత్నం

- ఆలేరులో ఘటన.. కేసు నమోదు

నెల్లికుదురు: కొడుకుపై తండ్రి హత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఈ నెల 27న మండలంలోని ఆలేరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జనగాం మౌనిక, నరేశ్‌కు 5 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు నవదీప్, కూతురు ఉన్నారు. నరేశ్ మద్యానికి బానిసై భార్య మౌనికను రోజూ కొడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 15న కూడా మద్యం సేవించి వచ్చి కొట్టగా మౌనిక తన తల్లిగారి ఊరు సూరిపెల్లికి వెళ్లిపోయింది. నరేశ్ ఈ నెల 27న సూరిపెల్లికి వెళ్లి భార్యతో గొడవపడి కుమారుడు నవదీప్‌ను తనతో ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం మద్యం మత్తులో అదే రోజు రాత్రి కుమారుడిపై హత్యాయత్నానికి పాల్పడాడు. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు బాబుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి మౌనికకు విషయం తెలిపారు. మౌనిక ఫిర్యాదు మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ వివరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

మరిపెడ: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల తండాలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మాకులతండాకు చెందిన గుగులలోతు అమృ(27) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో భార్య ప్రమీలతో కలిసి వ్యవసాయ చేస్తున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావడం, కుటుంబ పోషణ గడవకపోవడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్ద అమృ పురుగుల మందు తాగడంతో గమనించిన భార్య.. చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ సీజ్

- కంపెనీపై దాడి.. రూ.2.88 లక్షల విలువైన 20 క్వింటాళ్ల పేస్ట్ స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలోని కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కంపెనీలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి ముగ్గురు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. వారినుంచి రూ.2.88లక్షల విలువైన 20క్వింటాళ్ల అల్లం, వెల్లుల్లి పేస్టను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన గాయి సతీష్ శ్రీభద్రకాళీ మాత అల్లం, వెల్లుల్లి తయారీ చేసే కంపెనీ ఏర్పాటు చేయగా, ఆదే ప్రాంతానికి చెందిన బిలకిష్ అబువాని మరో కంపెనీ స్థాపించాడు. అదే ప్రాంతానికి చెందిన కూరపాటి నాగరాజు కూడా జై గణేష్ అల్లం, వెల్లుల్లి పేస్ట్ కంపెనీ ఉంది. ముగ్గురు రసాయనాలు కలిపి పేస్ట్ విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులకు పక్కా సమాచారం అందింది. సీపీ రంగనాథ్ ఆదేశాలు.. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సూచనల మేరకు పోలీసులు బుధవారం రాత్రి సతీష్, బిలకిషన్ అబువాని, నాగరాజుకు చెందిన కంపెనీలపై ఆకస్మిక దాడి చేశారు. ముగ్గురుపై కేసు నమోదు చేసి వారినుంచి అల్లం, వెల్లుల్లి పేస్ట్, తయారీకి ఉపయోగించే ముడిసరుకులను సీజ్ చేశారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రాంబాబు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ దారుణ హత్య..

- కాంట్రాక్ట్ డబ్బులు అడిగినందుకు ఘాతుకం..
- శివనగర్‌లో కలకలం
- పోలీసుల అదుపులో ఓ నిందితుడు?
- కొరవడిన నిఘా.. యథేచ్ఛగా హత్యలు



నజీర్ (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస హత్యలు కలకలం సృష్టిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం ఇదే పీఎస్ పరిధిలో ఇద్దరు నిందితులు ఓ వృద్ధుడిని గొంతు కోసి అతికిరాతంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరవక ముందే మంగళవారం అర్ధరాత్రి ఓ రౌడీషీటర్‌ను ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు రాడ్లతో తలపై కొట్టి దారుణంగా హతమార్చారు. ఈ ఘటన నగర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ శివనగర్‌కు చెందిన ఎస్‌డీ నజీర్ (37) వరంగల్ రైల్వేస్టేషన్‌లో సబ్ కాంట్రాక్ట్ తీసుకుని మొబైల్ క్యాంటీన్ నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడిపై మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. అతనిపై రౌడీషీట్ ఉంది. ఇదిలా ఉండగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పదిమంది వ్యక్తులు బతుకు దెరువు కోసం వరంగల్ వచ్చి శివనగర్‌లో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా రైల్వే స్టేషన్ ప్రాంగణం, రైళ్లల్లో ఎలక్ట్రానిక్స్ గూడ్స్, కీచైన్స్, పర్సులు విక్రయిస్తారు. వీరు స్టేషన్‌లో చిరువ్యాపారం చేసుకునేందుకు సబ్ కాంట్రాక్టర్, మృతుడు నజీర్‌కు నెల వారీగా అద్దె చెల్లించాలి. అయితే చిరువ్యాపారం చేస్తున్నారు. కానీ కాంట్రాక్ట్ డబ్బులు చెల్లించకుండా తిరుగుతున్నారు. రేపు మాపు అంటూ దాటవేస్తున్నారు.

ఇంటికి వెళ్తూ హత్యకు గురై..

మంగళవారం అర్ధరాత్రి నజీర్ క్యాంటీన్ బంద్ చేసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శివనగర్‌లోని తిరుమల బార్ పక్కనే ఉత్తర్‌ప్రదేశ్ వారు అద్దెకుంటున్న గదికి చేరుకున్నాడు. ఇరువురు మధ్య కాంట్రాక్ట్ డబ్బుల విషయంలో గొడవ జరగడంతో వారిని నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన వారు ఐరన్‌రాడ్లతో నజీర్ తలపై బలంగా కొట్టడంతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. నజీర్ చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం వారు గది నుంచి పారిపోయారు. ఈవిషయం తెలిసిన వెంటనే మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీలత, క్లూస్ టీమ్ అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన తీరును పరిశీలించి మృతుడి బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం నజీర్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రిజ్వాన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీలత తెలిపారు. కాగా, నగరంలో నిఘా కొరవడడంతోనే వరుస హత్యలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

పోలీసులు అదుపులో నిందితుడు..?

నజీర్‌ను దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితులు పరారయ్యారు. వీరిలో ఓ వ్యక్తిని రైల్వేస్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ తరలించినట్లు సమాచారం. పదేపదే తమను కాంట్రాక్ట్ డబ్బులు అడగడం వల్ల.. పైగా బెదిరించడంతో ఆత్మరక్షణకు హత్య చేశామని చెప్పినట్లు తెలుస్తోంది.

తల్వార్ ఫ్లెక్సీ తొలగింపు



ఫ్లెక్సీని తొలగిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధి గోపాలపురం పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఓ పార్టీ నాయకుడు తన జన్మదినాన్ని పురస్కరించుకుని తల్వార్ పట్టుకుని ఉన్న ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. బుధవారం గుర్తించిన పోలీసులు ఫ్లెక్సీని తొలగించారు.



నీలి చందమామ..సొగసు చూడతరమా అన్నట్టు కనిపించింది. బుధవారం రాత్రి చంద్రుడు.. భూమికి దగ్గరగా రావడంతో చాలా పెద్దగా కనిపించారు. వరంగల్ నగరంలో రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇలా నీలిరంగులో సూపర్ మూన్ దర్శనమిచ్చారు.

- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ